


(గత సంచిక తరువాయి)

పెద్ద కథ

ఆ సంఘటన జరిగాక ఆ ఇంట్లో చిత్రమైన మార్పులు జరిగాయి. క్రొత్త క్రొత్త అలవాట్లు వచ్చాయి సారథికి లెక్చరరు ఉద్యోగం అయింది అతడు కొత్తగా ఒక పని కుర్రవానిని పెట్టుకున్నాడు

"ఒరే రామం-నా గదిలో భోజనం ఏర్పాటు చేయమను," "రామం-స్నానానికి నీళ్ళుపెట్టు," "ఒరే ఇంట్లో డబ్బుకావాలేమో అడగరా-" ఇదీ ధోరణి అతడామెతో మాట్లాడడు - అతని గది దాటి వెళ్ళడు.

స్నానం భోజనం వగైరాలు ముగించి కాలేజీకి వెళ్ళిపోతాడు. సాయంత్రం యింటికి రాడు- వచ్చినా బట్టలు మార్చుకుని వెంటనే వెళ్ళిపోతాడు రాత్రి చాలా పొద్దుపోయి యింటికి వస్తాడు. ఫని పిల్లవాడు తలుపు తీస్తే సరాసరి తన గదిలోనికి పోయి తలుపు గడియ పెట్టుకుని నిద్రపోతాడు రాత్రులు భోజనం యింట్లో చెయ్యడు ఆమె అతనికి కావలసినవన్నీ రామం ద్వారా అమరుస్తుంది తానై అతని ఎదుటికి వెళ్ళదు. తనకు తోచినపుడు తాను భోజనం చేసి వేరే గదిలో నిద్రపోతుంది.

ఇదే రీతిలో దినాలు గడిచిపోతున్నాయి. అతనిలో మార్పు లేదు. ఈ మధ్య సుధలో కొన్ని మార్పులు వచ్చాయి. ఆమె అప్పుడప్పుడు బయటికి వెళ్తూంటుంది. ఎవరో ఆడవాళ్లు స్నేహితులు కాబోలు వచ్చి వెళ్తూంటారు ఎవరైనా వస్తే గంటల తరబడి మాట్లాడుతుంది నిర్విచారంగా ఉన్నట్లే కన్పిస్తుంది ఇది వరకులా కాక తనను తా నలంకరించుకోటంలో కొంత శ్రద్ధ చూపుతుంది. కాని అతడామెను గమనించే స్థితిలో లేడు అతని కామె కనబడటమే అరుదు

ఈ మధ్య అతడి ఆరోగ్యం చెడుతూంది. కొంచెం నలతగా కన్పిస్తున్నాడు అంతకంతకు నీరసిస్తున్నట్లున్నాడు. రాత్రులు దగ్గుతున్నట్లు ఏదో బాధపడుతున్నట్లు ఆమె కనిపెట్టింది.

"అయ్యగారికి సుస్తీగా ఉన్నట్లుంది డాక్టరును పిలవమంటారేమో అడుగు రామం!" అన్నది సుధ ఒకనాడు

రామం అడిగాడు.

"నా సంగతి నేను చూచుకుంటానులే" అన్నాడు సారథి.

రామానికి పన్నెండు సంవత్సరాలుంటాయి. ఈ భార్యా భర్తల మధ్య విరసం వాడికి తెలిసీ తెలియనట్లుంటుంది. రామం వట్టి వార్తా హరుడు మాత్రం. అమ్మగారికి ఆ వార్త కాస్తా చెప్పేశాడు - అంతటితో వాడి బాధ్యత తీరి పోయినట్లు.

''అయ్యగారు ఆరి సంగతి ఆరు చూసు కుంటారట్టండీ'' అన్నాడు చిలిపి నవ్వులు నవ్వుతూ.

అతని ఆరోగ్యం గురించి ఆమె బెంగ పడింది తనే ఆయన యింట్లో ఉండే సమ యానికి డాక్టరుకు కబురు పంపి రప్పించింది.

డాక్టర్ వస్తూనే "హల్లో! మిస్టర్ సారధి ఏమిటీ మీకు సుస్తీగా ఉందిట'' అని పలుక రించాడు.

సారధి తెల్లబోయి ''ఎవరు చెప్పారు?'' అన్నాడు.

''మీ మిసెస్ కబురు చేశారు'' అన్నాడు డాక్టరు.

ఇంతలో సుధ సాహసించి డాక్టరక్కడ ఉండగా చాలా కాలానికి ఆ గదిలోనికి వచ్చి, ''ఏమీ లేదండీ కొంచెం దగ్గుతున్నారు. నీరస పడి పోతున్నారు'' అన్నది.

సారధికి ఆమె యిలా రావటం విచిత్రంగానే తోచింది. చాలాకాలానికి మళ్లీ ఆమెను స్పష్టంగా చూశాడతను ఆమెలో ఏదొ క్రొత్తదనం కన్పిం చింది. ''ఆమేనా ఈమె' అనిపించిందొక సారి. అంతలో సర్దుకుని ''అవునండీ డాక్టర్! కొద్దిగా దగ్గు వస్తూందంతే'' అన్నాడు.

''ఆయన రాత్రులందు చాలాసేపు చదువు కుంటూ కూర్చుంటారు. నిద్ర చాలకనేమో ఈ చికాకులన్నీ బాగా నిద్రపోవాలని చెప్పండీ'' అన్నది సుధ డాక్టర్ వైపు తిరిగి.

డాక్టర్ ఒక నవ్వు నవ్వి "చూశారా! ఆవిడ ఏమంటున్నారో నిద్ర తక్కువయితే శరీరం పాడవదూ!" అన్నాడు.

సారధి సుధవైపు ఒక చురుకైన చూపు చూశాడు. అది కోపమో కృతజ్ఞతయో, సంభ్ర మమో తెలియనిది. ఆమె డాక్టర్‌తో అలా చెప్ప డంలో తను రాత్రులను గడిపే విధానాన్ని వెక్కిరిస్తున్నట్లా? లేక తన ఆరోగ్యం గురించ నిజంగా బాధపడి "ఆయన రాత్రులందు ఊరంట తిరుగుతారు'' అనలేక తన మర్యా దను కాపాడటానికలా చెప్పినదా? అను కున్నాడు. అతని కామె ప్రవర్తన ఆశ్చర్యం మాత్రం కల్గించింది.

''ఆ! ఏదో పుస్తకాలు చదువుతూంటే టైము తెలియదు నాకు ఇకమీద విశ్రాంతి తీసికుంటాను లెండి." అన్నాడు సారధి డాక్ట ర్‌తో. డాక్టర్ అతనిని పరీక్షచేసి ఏదో మందు వ్రాసిచ్చి వెళ్ళిపోయాడు.

పై సంఘటన జరిగాక సారధిలో తప్పక మార్పుంటుందనుకున్నది సుధ. కనీసం డాక్టర్ వెళ్లాక తాను చేసిన పనికి కోపగించుకు నైనా ఏదైనా మాట్లాడుతాడనుకున్నది. కాని అతడు యధాప్రకారం ఆమెయెడల మూగ తనం వహించాడు.

ఆ మూగతనం విడితేకాని ఈ సమస్య పరి ష్కారం కాదని ఆమెకు తెలుసును.

ఒకదినం అనుకోకుండా సుధ స్నేహితురా లొకామె వారింటికి అతిధిగా వచ్చింది. సుధకు పెండ్లయాక వారిద్దరూ కలుసుకొనటం ఇదే మొదటిసారి. ఆ అమ్మాయి వచ్చేసరికి సారధి యింట్లో లేడు ఇద్దరూ చాలాకాలానికి కలుసు కొనటంచేత ఏవేవో కబుర్లు ఆప్యాయంగా చెప్పకున్నారు.

"పోల్చుకోలేనంత మారిపోయావు సుమా- రాకరాక నీకే వచ్చిందీ మశూచి'' అన్నది సుజాత సుధను పరామర్శిస్తూ.

ఒకప్పుడయితే ఇలాంటి పరామర్శకు సుధ ఎంత బాధపడిపోయేదో? కాని యిప్పుడామెలో మునుపటి బాధ వ్యక్తంకాలేదు. ''పోనీలెద్దూ! మనచేతిలో ఏముంది?'' అన్నది

''అవునులే - కోరి కావాలని పెండ్లి చేసి కున్నావు మీ బావను ఇంకెలాగుంటేనేం అని నీ ధైర్యం కాబోలు'' అన్నది చిలిపిగా ఆమె బుగ్గలు గిల్లుతూ.

''పోనీలేవే నీ మాటలూ నువ్వూనూ'' అంది సుధ సిగ్గుపడుతూ.

సుజాత మాటలు సుధ మనస్సులో ఏవేవో భావాలు రేపాయి "అవును బావ అంతమంచి వాడు కనుక నన్ను కాదనలేక పెండ్లి చేసి కున్నాడు. ఛీ! నేనే అతనిని నొప్పించి ఇలాంటి పరిస్థితులు తెచ్చిపెట్టుకున్నాను." అని నొచ్చు కుంది.

"మీ అయనెప్పుడొస్తారే! నేనెప్పుడూ చూడ లేదతనిని నువ్వు పరిచయం చేయాలి సుమా!" అన్నది సుజాత.

సారథి సాయంత్రం వచ్చినపుడు రోజూ వలె రామంతో పంపించకుండా సుధ తానే తీసికుని వెళ్లింది కాఫీ అతని గదిలోనికి. అతడు కోటు విప్పకుంటూ మామూలుగా రామంవచ్చా డనుకుని 'ఎవరురా క్రొత్తవాళ్లు వచ్చినట్లుంది?' అన్నాడు.

"నా స్నేహితురాలు "సుజాత" అని చెపు తూంటాను. ఆమె వచ్చింది. యూనివర్శిటీలో రిసెర్చి స్టూడెంటుగా చేరాలని వచ్చిందిట. హాస్టలులో సీటు అదీ చూసుకునేవరకూ ఇక్కడే ఉండమన్నాను" అని అతని జవాబుకు నిరీ క్షించకుండానే కాఫీ ట్రే బల్లమీద పెట్టి "సుజాతా! ఇటు రావే" అన్నది.

సుజాత వయ్యారంగా సిగ్గుపడుతూవచ్చి "నమస్కారము" అన్నది. ఆతడు ప్రతి నమ స్కారం చేశాడు." మీ పెండ్లికి నేను రావాలను కున్నాను సరిగ్గా-అప్పుడు మా నాన్నగారికి బదిలీ అవటం గొడవలో ఉండి రాలేకపోయానండీ" అన్నది.

సారథికి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డ ట్లయింది. అతనికేం మాట్లాడాలో తెలియటం లేదు.

"కూర్చోండి-మీరు గ్రాడ్యుయేటు కోర్సు ఎక్కడ చదివారు?" అన్నాడు.

"రాజమండ్రిలో" అన్నది గదంతా కలయ చూస్తూ.

ఏదో ముక్తసరిగా నాలుగు మాటలాడి బయటికి వెళ్లాల్సిన పనుందని వెళ్ళిపోయాడు.

సారథికి పరాయి ఆడవాళ్ళతో మాట్లాడ టానికి తగని మొహమాటం, ఒక రకం మిత భాషి.

సారథికి సుధను గురించి ఒక సంతృప్తి మాత్రం కలిగింది. వాళ్లిద్దరిమధ్యా ఉన్న తెరల కారణంగా పైవాళ్లు వచ్చినప్పుడు ముభావంగా ఉండకుండా సర్ది పుచ్చుకునే తెలివి తేట లున్నాయి. కదా అని—"అయితే యిదంతా ఎందుకు చేస్తున్నట్లు ఆమె పశ్చాత్తాప పడు తుందా? అయితే వచ్చి అందరు ఆడవాళ్లకు వలెనే తనవల్ల పొరపాటు జరిగిందని క్షమాపణ కోరకూడదు! నేనే నేరం చేసిన వాడినన్నట్లు ఆమె అంత ఉదాసీనంగా ఉండటమెందుకు! పశ్చాత్తాపంలేదు. ఏమీలేదు, తన దాంపత్య జీవితం సరిలేదని తెలుసుకుంటే స్నేహితురాలి ముందర చిన్నబోవలసి వస్తుందని ఆమెకు గల స్వార్థమే ఆమెచేత యిలా చేయిస్తూంది." అనుకున్నాడు.

సుజాత మంచి చురుకైన పిల్ల. కొంచెం పొట్టిగా ఉన్నా ముఖం తీరు ఆకర్షణీయంగా ఉంటుంది. మంచి ఛాయ. వీటన్నిటికన్న ఆమె మాట్లాడేతీరు ఎవ్వరినైనా యిట్టే ఆకర్షి స్తుంది. కాస్త పరిచయమైతే చాలు ఇంక ఒకటే మాట్లాడటం.

ఆమె వచ్చిన మూడు నాలుగు దినములకే సారథితో బాగా చనువుగా మాట్లాడటం మొదలు పెట్టింది. మొదట ఒకటి రెండు దినములు సుధ దగ్గర లేనప్పుడంత మాట్లా డేది కాదు. ఇప్పుడు సుధ లేనప్పుడు ఆమె ఏ వంటపని లోనో ఉన్నప్పుడు కూడా అతనితో మాట్లాడేస్తుంటుంది. సారథికూడా యిదివర కంత భిడియపడటంలేదు. "ఇదీ బాగానేఉంది. కొంత కాలక్షేపం" అనిపించిందతనికి.

ఆదినం అతను కాలేజీకి వెళ్లేముందు "ఏమండోయి సుధ సినిమాకి పోదామంటున్నది త్వరగా రండి సాయంత్రం" అన్నది సుజాత.

"బాగుంది నేన్నూ నువ్వూ వెళదామను కున్నది" అంది సుధ.

"మీరిద్దరూ వెళ్ళండి నాకు కొంచెం పను న్నది" అన్నాడు సారథి.

"బలేవాళ్ళండీ-అసలు మీరే రమ్మని తీసు కుని వెళ్ళేది బదులు మేము అడిగితే కూడా రానంటున్నారా? మేము వెళ్ళేటట్లయితే మిమ్మ

ల్నేందు కడగటం-మీరు రావాల్సినదే!" అంది సుజాత గట్టిగా వత్తిడిచేస్తూ.

తప్పనిసరిగా సినిమాకి బయలుదేరాడు సారధి ఆ సాయంత్రం వాళ్లిద్దరినీ తీసికుని. ఆరోజు ఇద్దరూ ముచ్చటగా ముస్తాబయారు. సుధ సన్నని జరీ అంచు నేతచీర కట్టింది. సన్నని అల్లికపువ్వుల జాకెట్టు తొడిగింది. ముచ్చటగా చొల్లెముచుట్టి జాజిపువ్వులు దండ గుచ్చి వలయాకారంగా పెట్టుకుంది. సుజాత వదులుగా వాలుజడవేసి పొడవైన జాజిదండ వ్రేలాడుతూ తలలో పెట్టింది. లేత నీలి జార్జిటు సిల్కుచీర కట్టి మడతలు నడలకుండా వయ్యారంగా నడుస్తూంది.

సారధికి వాళ్ళనిచూసి అసూయ కల్గింది. స్నేహితురాలు వచ్చినదని కాబోలు సినిమాకి బయలుదేరింది. స్నేహితురాలితో పోటీ కోసం కాబోలు అంత చక్కగా అలంకరించుకుంది. తానెన్నిసార్లు కోరలేదామెను జాజి పువ్వులు తలలో ముడుచుకోమని? తానెన్నిసార్లు తనతో సరదాగా సినిమాకి రమ్మని కోరలేదు? సుజాత కిచ్చిన విలువకూడా తన కీయలేదామె-మళ్ళీ అతడు జరిగిపోయిన సంఘటనలన్నీ ఒక్కొక్కటీ తలపుకు తెచ్చుకున్నాడు. అతనికి కోపం ఉడుకుమోతుతనం వచ్చాయి. తనలో తనే బాధపడ్డాడు.

సినిమా హాలులోకి వెళ్ళారు ముగ్గురూ. క్రింది వరుసలో చాలాకాళీలున్నాయి. అతనటు వైపు దారితీశాడు. సుజాత "ఆ వరుసలోకి వద్దండీ పై వరుసలో మూడు సీట్లు కాళీ ఉన్నాయి. అక్కడ కూర్చుందాం పదండి" అన్నది. ముందు సుధ వెళ్ళి కూర్చుంది. తరువాత సుజాత, తరువాత సారధి. ఆ ప్రక్క ఈ ప్రక్క మనుష్యులున్నారు.

సారధికి సుజాత ప్రక్కని కూర్చోడానికి ఏమిటో జంకు-ఏదో యిబ్బందిగా ఉన్నట్లనిపించింది. అతనికి ఆడవాళ్లతో సినిమాకి వెళ్లడమే క్రొత్త. అయినా తనప్రక్క పరాయిపిల్ల కూర్చోవటం-ఏమంత నచ్చలేదు - మళ్లీ సుధ మీద కోపం వచ్చింది. "ఇక్కడకూడా చూపించుకోవాలా తనబుధి. ఏం తనువచ్చి నాప్రక్క కూర్చోకూడదూ. వెళ్ళి అవతల కూర్చోకపోతె ఆ మాత్రం బుద్ధి ఉండనక్కరలేదూ-అసలె అనుమానంకదా దానికి?" అని చిరాకుపడ్డాడు మనస్సులో.

....కధానాయకునికి కధానాయికపై కోపం వచ్చి పుట్టింటికి పంపేశాడు ఆమెకు బుద్ధి చెప్పాలని. అది ఆసరాగా తీసికుని చదువుకున్న పెంకిపిల్ల ఒకామె అతని వెంట పడింది. ఆడది తెగించితే మగవాడు నిగ్రహించటం కష్టం. కధానాయకుడీ ఉచ్చులోపడి కొట్టుకుంటున్నాడు-భార్యను తానై రప్పించటానికి తనపంతం అడ్డు వస్తుంది. ఆ అమ్మాయి తన వెంటపడి వేధిస్తూంది....

సినిమా జరుగుతూన్నంతసేపూ సారధి మనస్సు పరిపరివిధాలపోతూంది. తానుసుధకు కావాలని దూరంకాలేదు. అయినా పరిస్థితులలా వచ్చినవి. సినిమాలోని ఆ పెంకి అమ్మాయి పోలికలు సుజాతలో కన్పించినవతనికి. ఈ నాలుగుదినములయి యింట్లో మామూలుగా ఆమె మాట్లాడినంతసేపు బాగానే ఉందతనికి. కాని ఈ దినం సుజాత ప్రవర్తన ఏమీ నచ్చలేదతనికి.

సినిమాకి వచ్చేటప్పుడు నడిచి వచ్చేరు. మాటిమాటికీ తనను రాచుకుంటూ తనప్రక్కగా నడవటం-కల్పించుకుని తనతో మాట్లాడి తన వైపు అదోలాచూచి నవ్వటం అతనికి చిరాకు కల్గించాయి. హాలులో కూర్చున్నాక కూడా మాటిమాటికీ తనవైపు చూస్తుంది. సినిమా చూసినకంటె అతనిని చూడటమే ఎక్కువగా ఉన్నట్లుంది. అనవసరంగా తనకు తగులుతూ తనవైపుకు వంగుతుంది.

"చదువుకున్న పిల్ల-ఏమిటీ అసభ్య ప్రవర్తన" అనిపించిందతనికి.

"సుధ్వీ ప్రక్కకురా" అని సుధను తన ప్రక్క కూర్చోబెట్టుకుంటేనో అనిపించిం దొకసారి. మళ్లీ "ఆమెకు లేని బాధ నాకెందుకు! ఛీ ఛీ ఆడదానికి లేని జంకు నాకేల?" అనుకున్నాడు.

సినిమాలో కధానాయకుడు ఆ పెంకి పిల్లకు లొంగిపోయాడు చివరకి - ఈ సంఘటన చూచి

ుధ తప్పక బాధపడుతుందనుకున్నాడు సారధి.

తిరిగి వచ్చేటప్పుడు సుజాత సుధతో అన్నది "హీరోని వట్టి చవటనిచేసి పారేశాడు. ఆడ దానిని చూచి అంత గాభరా వడ్డాడేమిటి?" అని.

సుధ సీరియస్‌గా అన్నది, "గాభరా పడడూ మరి - అన్ని అనర్థాలకు ఆడదే కారణం"

సుజాత తననుద్దేశించే ఆ మాట లన్నది అని ఆలోచిస్తున్నాడు సారధి. సుధ మాట లతను వినిపించుకోలేదు

ఆ మరునాడు సారధికి కొద్దిగా జ్వరం వచ్చింది కాలేజీకి వెళ్ళలేక సెలవు పెట్టి యింట్లో పడుకున్నాడు. డాక్టర్ వచ్చి చూసి మందిచ్చి పోయాడు. సాయంత్రానికి ఎక్కు వయింది జ్వరం.

ఏదో మాటల సందర్భంలో సుజాత "బావ గారికి సినిమా పడదు కాబోలు. అందుకే జ్వరం వచ్చినట్లుంది - ఇంతకీ ఇది వంట్లో జ్వరమా- మనస్సులో జ్వరమా?" అంది హేళనగా.

అతడికి వళ్లు మండింది. కాని ఏమీ అన లేక పోయాడు. "ఈ సరస మేమిటి? ఈ వరస ఏమిటి? బావగారట-బావగారు-" అని లోలోపల మండిపడ్డాడు.

సుజాత స్నానానికి వెళ్ళింది. "మీ అమ్మ గారి నిలా పిలువు" అన్నాడు సారధి రామంతో.

సుధ వచ్చింది. "ఏం కావాలి?"

"నాకేం అక్కరలేదు. మీ స్నేహితురా లెన్నాళ్లుంటుందింకా యిక్కడ. నా కామె వైఖరి నచ్చలేదు. చూడగా చూడగా ఆవిడ తత్వం అదోలా ఉంది" అన్నాడు చిరాకుగా.

"రేపు వెళతాననే అంటూంది. మీరేం బాధపడనక్కరలేదు" అని వెళ్ళిపోయింది సుధ.

తనకు తానై పిల్పించినందుకు సుధ మరి నాలుగు మాటలాడుతుందనుకున్నాడు. "ఆమె కింత మొండితనమా?" అని బాధపడ్డాడు.

రాత్రి నిద్రపోయేముందు "కొంచెం పళ్ళ రసం తీసుకుంటారా" అంది సుధ.

"కావలిస్తే రామం యిస్తాడు. నీవు బాధపడ నక్కరలేదు" అన్నాడు సారధి.

ఆమె తనను బ్రతిమాలుకుంటుం దను కున్నాడు. కాని ఆమె మరి మాటాడకుండా వెళ్లి పోయింది.

ఆ రాత్రంతా అతనికి నిద్రపట్టలేదు సుజాత అన్నట్లు వంట్లో జ్వరం కంటే మనస్సులో బాధ ఎక్కువయింది. సుధ ప్రవర్తన యేమీ అర్థం కావటంలేదు ఒక్కొక్కసారి ప్రసన్నంగా ఉన్నట్లుంటుంది అంతలోనే తనకేమీ పట్ట నట్లూరుకుంటుంది. ఎందుకో ఆ నిర్లిప్తత. ఆమె తన యెడల అంత ఉదాసీనత ప్రకటిం చినా తానెందుకిలా జట్టుబడి ఉండాలి! తానె లాగా అనుమానించబడ్డాడు. అవమానించ బడ్డాడు. తన బాధ నామె గుర్తించకపోయినా తానెందు కామె గురించి ఆలోచించాలి....

"ఆమె హాయిగా నిద్రపోతూంది కాబోలు? నాలాగ బాధపడడం లేదూ!"

అతనికి వేదనగా ఉంది. అంతులేని ఆలో చనల ఆకాశంలో విహరిస్తున్నాడతడు.

ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టటంలేదు.

విశాలమైన పందిరి మంచంమీద ఆ ప్రక్క నుండి ఈ ప్రక్కవరకూ ఎన్నిసార్లు దొర్లాడో లెక్కలేదు అంతపెద్ద మంచంమీద తానొ క్కడూ—ఒక పెద్ద ఎడారిలో తానొక్కడే అయి నట్లు విపరీతమైన ఒంటరితనంచేత బాధ పడ్డాడు ప్రొద్దుటికి జ్వరం తగ్గింది. రాత్రి నిద్రలేక పోవటాన బాగా నీరసంగాఉంది.

ఆ దినం సాయంత్రం సుజాత "హాస్టలులో సీటు దొరికిందండీ నేనిప్పుడే పెళ్తున్నాను" అని బండిలో సామాను పెట్టించుకుని వెళ్లింది.

"అమ్మయ్య!" అనుకున్నాడు-సారధి. అతని మనస్సు తేలికబడింది.

ఆరాత్రి బండికి హఠాత్తుగా సారధి తల్లి తండ్రులు వచ్చారు.

"ఎలా ఉంది నాయనా వంట్లో" అంది వాళ్లమ్మ లోపలికి వస్తూనే!

అతడా మాటలను విన్పించుకోకుండానే "ఏమిటిల్లా ఉత్తరమైనా వ్రాయకుండా వచ్చా శారే! ఉత్తరం వ్రాస్తే స్టేషనుకు వచ్చేవాడిని కదా!" అన్నాడు.

"బాగుంది-సుస్తీగా ఉంది స్టేషనుకెలా వస్తావురా?" అన్నాడు సారధి తండ్రి.

"అసలెవరు చెప్పారు సుస్తీగా ఉందని."

''వైరిచ్చానని చెప్పలేదుటే పిల్లా'' అన్నది కోడలినిచూచి అత్తగారు.

''నిన్ననంతా తీవ్రంగా జ్వరం వచ్చింది. వారు ఒకటే కలవరింతలు. నాకు భయంవేసి వైరిచ్చాను. చెపితే ఈ మాత్రం దానికింత హడావుడి ఎందు కంటారని చెప్పలేదు'' అన్నది సుధ చిన్న నవ్వుతూ.

సుధ అంత సహజమైన నవ్వు నవ్వటం అతను చాలో కాలానికి చూశాడు.

''సుధ వైరిచ్చిందా? ఎందు కిచ్చినట్లు-నేను కలవరించిటమేమిటి? అసలు నిన్న నంతా నిద్రయినా పోలేదే'' అతని కిదంతా ఆశ్చర్యంగా ఉంది. పైకి ఏమనటానికి వీలు లేక ''ఆ, నిన్న కొంచెం జ్వరం వచ్చింది. ఏదో గాభరాపడింది కాబోలు'' అనేశాడు.

సుధ అత్తగారికీ మామగారికీ లోపల వడ్డి స్తూంది. సారధి రామం చెవిలో మెల్లగా ''ఒరే రామం అమ్మగారికి కూడా నా గదిలోనే పక్క వేసేయి'' అన్నాడు.

వాడి కేదో చాలా అర్థం అయినట్లు తల వూపాడు; చిన్న నవ్వు నవ్వుకుంటూ.

సారథి యిలా చెప్పవలసి వచ్చినందుకు సిగ్గుపడ్డాడు. ఈ యింట్లో జరిగే రాద్ధాంతాలన్నీ ఇంతవరకూ మరెవరికీ తెలియవు. ఇప్పుడతని తల్లితండ్రులు ఏమాత్రం వీరిద్దరికీ పడటం లేదని పసికట్టినా ''వద్దు వద్దంటే కావాలని పెళ్లి చేసుకున్నావు, ఏ మనుభవిస్తున్నావురా నాయనా!'' అంటారని తెలుసు. అలా అని పించుకోవటం చాలా చిన్నతన మనిపించిం దతనికి.

అందరూ భోజనాలు చేశారు. అతని కాకలి వేసింది. డాక్టరు భోజనం చేయవచ్చును అన్నాడు. కాని నిన్ననే అంత జ్వరం వచ్చిం దని వైరిచ్చి ఈ దినం భోజనం చేస్తూంటే అమ్మా నాన్నా ఏమనుకుంటారో-అనిపించింది.

సుధ అడగకముందే ''నాకు పళ్లరసం తెచ్చియ్యి'' అని అడిగి అది త్రాగి పడుక్కు న్నాడు.

నిన్న రాత్రి నిద్రలేకపోవటాన్నేమో అతనికి త్వరగానే నిద్రపట్టింది.

రాత్రి ఎప్పుడో నిద్రనుండి తెలివి వచ్చింది. కిటికీలోనుండి చల్లనిగాలి వీస్తూంది. కొంచెం చలిగా ఉండి కప్పుకుందుకు కాళ్ళదిక్కున ఉన్న దుప్పటీ అందుకోపోయాడు. అప్రయ త్నంగా అతని చేయి ఆమె వెచ్చని బుగ్గపై పడింది. అతడులిక్కిపడి లేచి చూశాడు.

ఆశ్చర్యం! ఆమె ఒదిగి, ఒదిగి, అతని కాళ్ళదగ్గర పడుకునుంది. కిటికీలోంచి వచ్చే వెన్నెల వెలుగులో ఆమె స్పష్టంగా కన్పిస్తూంది. తలనిండా జాజిపువ్వులు పెట్టుకుంది. అవి విరిసి విరిసి పక్కుమని నవ్వి "నన్నుచూడండి" అంటున్నట్లున్నాయి వాటితోపాటే ఒదిగిపోతూ మిసమిసలాడుతూ వెన్నెల వెలుగులో మిల మిల లాడుతూన్న మృదువైన మందార రంగు పట్టుచీర కట్టింది. ఆ రంగంటే అతనికి చాలా యిష్టం. అది ఆ తొలిరేయి ఆమెకు కాన్కగా యిచ్చాడు. ఇంతవరకామె దాని గడి విప్ప లేదు. వంటికి చందనం పూసినట్లు వంటినంటి పెట్టుకొన్న పలుచన పసుపురంగు పట్టుజాకెటు ఆ చీర అందానికి మెరుగులు దిద్దుతూంది. నల్ల త్రాచులా మెలికలు తిరుగుతూ జడ మెడ మీదుగా వక్షంమీద పడిఉంది.

కొన్ని నిముషాలు స్థబ్దుడై అతడలా ఆమె వంక రెప్పవాల్చకుండా చూశాడు. ముచ్చటగా ముస్తాబై ప్రశాంతంగా నిద్రపోతూందామె. కదిపితేనలిగిపోతుందేమో అనిపించిందొకసారి.

కాని....జాజిపూవుల వాసన-సన్నని వెన్నెల వెలుగు-ఎదురుగా తన సుధ-ఏదో మైకం క్రమ్మి నట్లయిందతనికీ-ఆ నాడతనికి ఆమెలో ఎప్పుడూ చూడని వింత సోయగం కన్పించింది. అతడు తనకు తెలియకుండానే ఆమెను ఒడిలోనికి తీసి కున్నాడు. ఆమె చిన్న కదలిక కదలి తన ముఖాన్ని అతని వక్షంలో ఇముడ్చుకుంటూ "బావా నన్ను క్షమించవూ?'' అన్నది.

అతడు పరవశుడయ్యాడు. హృదయం నాట్యం చేసింది. రక్తం పొంగి పొర్లింది.

అతనిలోని శక్తి విజృంభించింది. మనస్సులో వెన్నెలలు విరిశాయి. అతడు అతనికే తెలియని ఆనందంలో తన్మయుడైనాడు. ఆమెను దగ్గరగా-యింకా దగ్గరగా- తీసికున్నాడు. ఉత్సాహం ఉరకలు వేయగా ఉద్రేకం పర వళ్లు త్రొక్కగా కోరికలు ఉత్తూతలూగించగా అతడామెను మరింత తనలోనికి ముడ్చు కున్నాడు.

ఆకాశంలో చందమామలా, చందమామలో నీల లాంఛనంలా, కంటిలో పాపలా, కను పాపలో నీడలా ఆమె అతనిలో ఇమిడిపోయింది.

అలా ఎంతసేపు పరవశమై పోయారో!

ఏ అవ్యక్తానంద మధురిమల నాస్వా దించారో!

అతనికి కొంత సేపటికి కాని తెలియలేదు.

ఆమె అవిరళంగా అశ్రుధారల కురుపి స్తున్నదని.

ఆతని వక్షం అప్పటికే తడిసిపోయిందని.

అతడామె ముఖంలో ముఖం చేర్చి "సుధా! ఏడుస్తున్నావా? ఎందుకూ దుఃఖం-మర్చిపో-గతం అంతా మర్చిపోయి ఒక్కసారి నవ్వు. మన జీవితపు చెట్టు మొగ్గ తొడిగింది. నీ నవ్వుతో మొగ్గలన్నీ విరియబూస్తాయి. జీవితమే పువ్వై వికసిస్తుంది."

అతడేమేమో మాట్లాడేస్తున్నాడు. అతడు రసోన్మాదంలో మునిగి తేలుతున్నాడు. ఆనందం అనురాగం అవధులు దాటాయి ఎంతో కాలం నుండి వారిలో గూడు కట్టుకొనిన మూగ భావాలు క్రొత్తరాగా లాలపించాయి.

• • •

మరునాటి సాయంత్రం "కాఫీ యియ్యి-అలా బయటికి పోయి వస్తాను" అన్నాడు సారధి.

"సుజాత వస్తానన్నది ఆమె రానీయండి-అందరం కలసి కాఫీ తీసికుందాం" అన్నది సుధ.

"ఓ! ఆవిడా - కావలిస్తే నువ్వు తాగు ఆవిడతో - నేను వెళతాను."

"సుజాతంటే ఎందుకూ మీకంత కోపం."

"కోపం కాదు - అసహ్యం. ఆవిడ అదో లాంటి మనిషి."

"మా సుజాత చాలా మంచిపిల్ల. మీరు గ్రహించ లేదు. మీతో కావాలని అలాగ ప్రవర్తించింది మీ యింగితం తెలుసుకోవాలని-నిజానికి అది చెప్పకపోతే నేను మీ వాళ్ళకు వైరిచ్చే దానినే కాను. వైరివ్వకపోతే వాళ్ళు వచ్చేవారూ కాదు - మీ వాళ్లే రాకపోతే...."

"బావగారికి జ్వరమే తగ్గక పోను" అన్నది అప్పుడే లోపలికి వచ్చిన సుజాత

"ఓహెూ ఇదంతా మీరు పన్నిన పన్నాగ మన్నమాట! అయితే చాలా థేంక్సు" అన్నాడు సారధి.

"మీ థేంక్సు ఎవరిక్కావాలి మంచి సిని మాకి తీసుకుపొండి. మీతో కలసి పిక్చరు చూడటమంటే నాకు చాలా సరదా" అన్నది సుజాత తన మామూలు చిలిపి తనం ప్రదర్శిస్తూ.

"నాకు కూడా సరదాయే కాని సుధకుఅనలే అనుమానం నా మీద- వద్దులెండి-" సుధ కళ్ళ ల్లోకి సూటిగా చూశాడు సారది.

"దెబ్బకు దెయ్యం జడిసిందని ఆ దినం మీ ప్రళయ తాండవం చూడగానే పోయింది నా అనుమానమంతా" అన్నది సుధ.

(సమాప్తము) ★

---

భోజనానంతరం అతిథీ గృహస్థూ వరండాలో కూర్చుని తాంబూలం సేవిస్తు న్నారు. అతిథి అన్నాడు: "దాతృత్వం దొడ్డ గుణం. మనం ఒక వస్తువు యిస్తే, ఎప్పటికైనా అది రెట్టింపై మనకే తిరిగి వస్తుంది."

"నిజం" అన్నాడు గృహస్థు, "గత వైశాఖంలో పెద్దమ్మాయికి పెళ్ళి చేసాను. జ్యేష్టమాసం నుండీ అల్లుడూ అమ్మాయీ మా యింటికే వచ్చి ఉంటూన్నారు."